ప్రజాశక్తి

సోమవారం 1 ఏప్రిల్ 2024

8 పేజీలు


విశాఖపట్నం


అనకాపల్లి

విశాఖలో క్రికెట్ సందడి

- చెన్నయ్‌పై ఢిల్లీ క్యాపిటల్స్ ఘన విజయం
- బ్యాటింగ్‌తో ఆకట్టుకున్న పంత్, వార్నర్, పృథ్వీషా
- ఐపిఎల్ పోరును చూసేందుకు పోటెత్తిన అభిమానులు

ప్రజాశక్తి - పిఎం.పాలెం : విశాఖ వేదికగా పిఎం.పాలెం సమీపంలోని ఎసిఎ - విడిసిఎ క్రికెట్ స్టేడియంలో ఆదివారం చెన్నయ్ సూపర్ సింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరిగిన మ్యాచ్‌ను చూసేందుకు అభిమానులు పోటెత్తారు. ఉదయం నుంచే విశాఖ నగరంలో క్రికెట్ సందడి నెలకొంది. వేలాది మంది క్రికెట్ అభిమానులతో స్టేడియం పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. చెన్నయ్ సూపర్ కింగ్స్ క్రీడాకారుడు ధోనిని చూసేందుకు అభిమానులు పెద్దఎత్తున స్టేడియానికి వచ్చారు. మైదానంలో ధోనీ పేరు మార్మోగిపోయింది. తొలుత టాస్ గెలుచుకుని బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్


బ్యాటింగ్‌లో రాణించిన వార్నర్, పృథ్వీషా

నిర్ణీత 20 ఓవర్లలో 191 పరుగులు చేసి ఐదు వికెట్లు నష్టపోయింది. వార్నర్, పంత్ బ్యాట్లతో చెలరేగిపోయారు. చెరొక అర్ధ సెంచరీ చేసి జట్టు భారీ స్కోరుకు దోహదపడ్డారు. ఓపెనర్ పృథ్వీషా 27 బంతుల్లో 43 పరుగులు చేసి రాణించాడు. చెన్నయ్ బౌలర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. అనంతరం బ్యాటింగ్ బరిలోకి దిగిన చెన్నయ్ సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 171 పరుగులే చేసింది. దీంతో 20 పరుగుల తేడాతో ఢిల్లీ గెలిచింది. చెన్నయ్ జట్టులో రహానే 45 పరుగులతో రాణించాడు.

(ప్రధాన వార్త మెయిన్‌లో..)


విశాఖలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న పలు పార్టీల నాయకులు

కేజ్రీవాల్ అరెస్టుపై నిరసన

వార్త 2లో..

విశాఖ నుంచి పలు ప్రత్యేక రైళ్లు

వార్త 2లో..

సరుకు రవాణాలో విశాఖ పోర్టు రికార్డు

వార్త 2లో..



మత్స్యకారుల సమస్యలు తెలుసుకుంటున్న ఝాన్సీ, వాసుపల్లి

పలుచోట్ల వైసిపి ఎంపీ అభ్యర్థి ఝాన్సీ ప్రచారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైసిపి ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి ఆదివారం విశాఖ నగరంలో పలుచోట్ల ప్రచారం నిర్వహించారు. ఫిషింగ్ హార్బర్ ఏరియాలో మత్స్యకారులకు అభివాదం చేస్తూ ఆమె ప్రచారం సాగించారు. మత్స్యకార మహిళలు, బోటు కళాశీలు, మత్స్యకార అసోసియేషన్ నాయకులు, బోటు యాజమాన్యాల ప్రతినిధులతో మాట్లాడారు. గంగపుత్రులైన మత్స్యకారులను జగనన్న ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని చెప్పుకొచ్చారు. చంద్రబాబుకు మత్స్యకారులు మరోసారి ఝలక్ ఇవ్వనున్నారన్నారు. వేటకు వెళ్లే మత్స్యకారులకు, ఎండలో వ్యాపారం చేసుకునే మహిళలందరికీ కళ్లకు రక్షణ కల్పించే చలువ కళ్ళద్దాలు అందిస్తామని అన్నారు. ఆమె వెంట పార్టీ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, ఎన్నికల పరిశీలకులు ద్రోణంరాజు శ్రీవాత్సవ్, కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, వైసిపి వార్డు అధ్యక్షులు పోతు స్వామి, మాజీ కార్పొరేటర్ చింతపల్లి పోతురాజు (పులి) తదితరులు ఉన్నారు. తన పర్యటనలో ఝాన్సీ చేపల వ్యాపారులతో మాట్లాడారు. వారి రోజువారి ఆదాయాన్ని అడిగి తెలుసుకున్నారు. వారి దగ్గర చేపలను కొనుగోలు చేసి ఉత్సాహపరిచారు.

సమస్యల పరిష్కారానికి కృషి

లాసన్స్ బే కాలనీలోని తన క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో బొత్స ఝాన్సీ లక్ష్మీ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తాను గతంలో బొబ్బిలి, విజయనగరం ఎంపీగా పోటీ చేసి విజయం సాధించిన విషయాన్ని గుర్తుచేశారు. తన పుట్టినిల్లు విశాఖలోని శ్రీహరిపురం అని తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి విశాఖ గ్రోత్ ఇంజిన్ వంటిదని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. తాను గెలిస్తే విశాఖ సమస్యలను పార్లమెంట్‌లో వినిపిస్తానన్నారు. మీడియా సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్ అరెస్టుపై నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షులు కేజ్రీవాల్‌ను తప్పుడు కేసులో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇరికించి అరెస్టు చేసిందని, ఈ చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరుతూ ఆదివారం సాయంత్రం నగరంలోని ఎల్ఐసి కార్యాలయ దరి అంబేద్కర్ విగ్రహం వద్ద పలు పార్టీల నాయకులు నిరసన తెలిపారు. అంబేద్కర్ విగ్రహానికి కేంద్ర ప్రభుత్వ చర్యను నిరసిస్తూ వినతిపత్రం సమర్పించారు. అనంతరం అక్కడి నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ సభ ఏర్పాటు చేశారు. సభలో మాట్లాడిన వక్తలంతా కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలను ఖండించారు. మోడీ దుర్మార్గ పాలనకు ప్రజలు త్వరలో చరమగీతం పాడతారన్నారు. కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ సీర రమేష్, రాష్ట్ర మహిళా కన్వీనర్ డాక్టర్ సీతల్ మదన్, భారత్ బచావో రాష్ట్ర కన్వీనర్ గూడూరు సీతామహాలక్ష్మి, అధ్యక్షుడు ఎస్ఆర్.వేమన, కన్వీనర్ వి.శ్రీనివాస్, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సిపిఎం జిల్లా నాయకులు వి.కృష్ణారావు, అప్పలరాజు, కుమారి, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జెవి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సరుకు రవాణాలో విశాఖ పోర్టు రికార్డు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 2023-24 ఆర్థిక సంవత్సరంలో 81.09 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకును రవాణా చేసి విశాఖ పోర్టు సరికొత్త రికార్డును నెలకొల్పిందని పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. తాజా రవాణా రికార్డు ద్వారా గత ఏడాది చేసిన 73.75 మిలియన్ మెట్రిక్ టన్నుల రికార్డును తిరగరాసినట్టు పేర్కొన్నారు. ఈ రికార్డు విశాఖపట్నం పోర్టు సామర్థ్యాన్ని తెలియజేస్తోందని తెలిపారు. పోర్టు ఈ ఘనతను సాధించడంపై పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఘనతను సాధించడంలో సిబ్బంది కృషి ఎంతగానో ఉందంటూ ప్రశంసల వర్షం కురిపించారు.

ఓటర్ల చెంతకు విస్తృత సేవలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : ఓటర్లకు చేరువుగా విస్తృత సేవలు అందిస్తున్నామని.. దానిలో భాగంగానే మన పోలింగ్ బూత్ - మన ఓటు చైతన్య కార్యక్రమాన్ని చేపట్టామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు అన్ని దశలలో ఓటర్లకు అన్ని రకాల సేవలు అందిస్తున్నామని ఉద్ఘాటించారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా చేపట్టిన మన పోలింగ్ బూత్ - మన ఓటు కార్యక్రమ అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన పై మేరకు మాట్లాడారు. ముందుగా తూర్పు నియోజకవర్గ పరిధిలో పెదవాల్తేరులోని కోటక్ సెల్సియస్, విశాలాక్షినగర్‌లోని బివికె.స్కూళ్ల వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. జెసి మయూర్ అశోక్ ఆయన వెంట ఉన్నారు.

విశాఖ నుంచి పలు ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వేసవి నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని నివారించి, వారికి సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. ఈస్ట్ కోస్ట్ రైల్వే వారపు ప్రత్యేక రైళ్లను పొడిగించాలని నిర్ణయించింది. అందులో భాగంగా 08579 విశాఖపట్నం-సికింద్రాబాద్ వీక్లీ స్పెషల్ రైలు ఏప్రిల్ 3 నుండి జూన్ 26 వరకు ప్రతి బుధవారం రాత్రి 19.00 గంటలకు విశాఖపట్నం నుండి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 09.05 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. 08580 సికింద్రాబాద్-విశాఖపట్నం వీక్లీ స్పెషల్ రైలు ఏప్రిల్ 4 నుండి జూన్ 27 వరకు ప్రతి గురువారం రాత్రి 19.40 గంటలకు సికింద్రాబాద్ నుండి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 09.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైళ్ళు దువ్వాడ, అనకాపల్లి, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లె, మిర్యాలగూడ, మీదుగా ప్రయాణిస్తాయి

08583 విశాఖపట్నం-తిరుపతి వీక్లీ స్పెషల్ రైలు ఏప్రిల్ 1 నుండి జూన్ 24 వరకు ప్రతి సోమవారం రాత్రి 19.00 గంటలకు విశాఖపట్నం నుండి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 09.15 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. 08584 తిరుపతి-విశాఖపట్నం వీక్లీ స్పెషల్ ఏప్రిల్ 2 నుండి జూన్ 25 వరకు ప్రతి మంగళవారం రాత్రి 21.55 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైళ్ళు విశాఖపట్నం-తిరుపతి మధ్య దువ్వాడ, అనకాపల్లి, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట మీదుగా ప్రయాణిస్తాయి.

08543 విశాఖపట్నం - ఎస్ఎంవి బెంగుళూరు వీక్లీ స్పెషల్ రైలు ఏప్రిల్ 7 నుండి జూన్ 30 వరకు ప్రతి ఆదివారం మధ్యాహ్నం 15:55 గంటలకు విశాఖపట్నం నుండి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12:30 గంటలకు ఎస్ఎంవి బెంగళూరు చేరుకుంటుంది. 08544 ఎస్ఎంవి బెంగుళూరు -విశాఖపట్నం వీక్లీ స్పెషల్ ఏప్రిల్ 8 నుండి జూలై 1 వరకు ప్రతి సోమవారం మధ్యాహ్నం 15.50 గంటలకు ఎస్ఎంవి బెంగుళూరులో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 13.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైళ్ళు దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, కుప్పం, బంగారుపేట, బెంగళూరు సెంట్రల్, బంగారపేట, కృష్ణరాజపురం మీదుగా ప్రయాణిస్తాయి.

08585 విశాఖపట్నం-కర్నూల్ సిటీ ప్రత్యేక రైలు ఏప్రిల్ 2 నుండి జూన్ 25 వరకు ప్రతి మంగళవారం సాయంత్రం 17.35 గంటలకు విశాఖపట్నం నుండి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 13.25 గంటలకు కర్నూలు నగరానికి చేరుకుంటుంది. 08586 కర్నూలు సిటీ -విశాఖపట్నం ప్రత్యేక రైలు ఏప్రిల్ 3 నుండి జూన్ 26 వరకు ప్రతి బుధవారం మధ్యాహ్నం 15.30 గంటలకు కర్నూలు సిటీ నుండి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 09.50 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైళ్లు దువ్వాడ, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లె, మిర్యాలగూడ, నల్గొండ, మల్కాజిగిరి, కాచిగూడ, ఉమ్దానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల్ మీదుగా ప్రయాణిస్తాయి.

ప్రభుత్వ విధానాలు నచ్చకనే రాజీనామా

ఏ పార్టీలో చేరేదీ త్వరలో నిర్ణయం
వైసిపి జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పడు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటప్పడు

ప్రజాశక్తి -తగరపువలస : వైసిపి ప్రభుత్వ విధానాలు నచ్చకనే వైసిపికి, జెడ్‌పిటిసి సభ్యుని పదవికి రాజీనామా చేస్తున్నట్లు గాడు వెంకటప్పడు ప్రకటించారు. స్థానికంగా ఆదివారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వ విధానాలు నిరుద్యోగం పెంచేవిలా ఉన్నాయని ఆరోపించారు. ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా, ఒకింత ఆందోళనకరంగా ఉందని స్పష్టం చేశారు. ఉచిత పథకాలే ఇందుకు కారణం అని విమర్శించారు. అభివృద్ధి లేనే లేదని, అరాచకం ప్రబలి పోయిందని ధ్వజమెత్తారు. జెడ్‌పిటిసి సభ్యుని పదవికి రెండు, మూడు రోజుల్లో జెడ్పీ కార్యాలయంలో నిబంధనలు అనుసరించి రాజీనామా చేయనున్నట్లు పేర్కొన్నారు. పార్టీకి తనతో పాటు రాజీనామా చేసిన వారిలో సింగనబంద సర్పంచ్ వెంకటనారాయణ, పిఎసిఎస్ డైరెక్టర్ గాడు తాతినాయుడు తదితరులతో పాటు దాదాపు 8 పంచాయతీలకు చెందిన పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు ఉన్నట్లు చెప్పారు. ఏ రాజకీయ పార్టీలో చేరేదీ త్వరలో ప్రకటిస్తానని చెప్పారు

రాజీనామా వెనుక స్వార్థ ప్రయోజనాలు : వైసిపి

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండల జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పడు, ఇంకొందరు అతని అనుచరులు వైసిపికి రాజీనామా చేయడం వెనుక వారి స్వార్థ ప్రయోజనాలు దాగి ఉన్నాయని వైసిపి మండల అధ్యక్షులు గాడు శ్రీను విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇప్పుడు రాజీనామా చేసిన వారంతా 2019లో తమ పార్టీలో చేరిన తర్వాత పార్టీకి ఎటువంటి ప్రయోజనం లేదు, సరికదా పార్టీకి ఇప్పుడు వచ్చిన నష్టమూ లేదని స్పష్టం చేశారు. పార్టీకి రాజీనామా చేసిన వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షునికి సిఫారసు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డి.పెదబాబు, ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, వైస్ ఎంపిపి బోని బంగారునాయుడు, మజ్జిపేట, రేఖవానిపాలెం పంచాయతీ సర్పంచులు మజ్జి సూరినాయుడు, సమ్మిడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ యాతపేట కాలనీలో ఆదివారం దల్లి నారాయణరెడ్డి (40) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం... యాతపేటకు చెందిన దల్లి లీలావతి పెద్ద కుమారుడు దల్లి నారాయణరెడ్డి (40) భార్య భార్గవితో మనస్పర్థలు కారణంగా రెండేళ్ల నుంచి వేరువేరుగా ఉంటున్నారు. నారాయణరెడ్డికి ముగ్గురు సంతానం ఉన్నారు. ఇద్దరు పిల్లలు భార్గవి దగ్గర, ఒక కుమారుడు నారాయణరెడ్డి దగ్గర ఉంటున్నారు. నారాయణరెడ్డి బ్యాటరీ వెహికల్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఆదివారం తల్లి లీలావతి రక్త పరీక్షల కోసం బయటికి వెళ్లింది. ఆ సమయంలో ఇంటిలో ఉన్న నారాయణరెడ్డి బెల్టు సహాయంతో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి లీలావతి ఫిర్యాదు మేరకు ఆనందపురం సిఐ టీవీ తిరుపతిరావు ఆధ్వర్యాన ఎస్ఐ గంట్యాడ సంతోష్ కేసు నమోదు చేశారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-చీడికాడ:మనస్థాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ నారాయణరావు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు ...చీడికాడ మండలం సిరిజం గ్రామానికి చెందిన విశారపు గణేష్ (19) ఇంటిలోనే ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గణేష్, తల్లిదండ్రుల మధ్య తరచూ గొడవలతో యువకుడు మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన అన్నారు.

ఎఆర్‌సిలో ఎలుగుబంటి మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాల ఎదురుగా గల యానిమల్ రెస్క్యూ సెంటర్ (ఎఆర్‌సి)లో మగ ఎలుగు బంటి శనివారం తెల్లవారు జామున మృతిచెందినట్టు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు. ఈ విషయాన్ని జూ అధికారులు ఆలస్యంగా తెలియజేశారు. మృతిచెందిన ఎలుగుబంటి వయస్సు సుమారు 30 ఏళ్లు ఉంటుందన్నారు. వృద్ధాప్యం కారణంగానే మృతి చెందినట్లు పోస్టుమార్టం రిపోర్టులో నిర్ధారించారు. 2019లో శ్రీకాకుళం జిల్లా వజ్రపు కొత్తూరులో పోలాల్లోకి ప్రవేశించిన దీనిని పట్టుకొని తీసుకొచ్చి ఎఆర్‌సిలో సంరక్షిస్తూ వచ్చారు. సాధారణంగా అడవిలో ఎలుగుబంటి సగటు జీవిత కాలం సుమారు 25 ఏళ్ళు ఉంటుందని జూ క్యూరేటర్ తెలిపారు.

గీతం ఎన్‌ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి -మధురవాడ : స్థానిక సాగర్‌నగర్ గ్రామంలోని మారనత చిల్డ్రన్ హోమ్‌లో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఎన్‌ఎస్ఎస్ వాలంటీర్ల ఆధ్వర్యాన ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మానసిక వికలాంగులకు రెండు రోజుల పాటు వివిధ రకాల సేవలనందించారు. ఆటపాటలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రాజా, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్, ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సుమంతో మండల్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపయుక్తంగా మైదానాలు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్యార్థులకు, నగర ప్రజలకు ఉపయుక్తంగా ఏయూలో క్రీడా మైదానాలను అభివృద్ధి చేస్తున్నట్లు ఏయూ ఇంజినీరింగ్ విభాగం డీన్ ఆచార్య కె.శ్రీనివాసరావు, యూనివర్సిటీ ఇంజినీర్లు ఆర్.శంకరరావు, డి.రాజశేఖరరాజులు సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీలో దశాబ్దాలుగా అసాంఘిక శక్తులకు అడ్డాగా ఉన్న తుప్పలతో కూడిన స్థలాన్ని నగరప్రజలకు ఉపయుక్తంగా మైదానంగా దాతల సహకారంతో గతంలో తీర్చిదిద్దామని పేర్కొన్నారు. దీనిని మరింత అభివృద్ధి చేసి అంతర్జాతీయ స్థాయిలో క్రీడల నిర్వహణకు ఉపయుక్తంగా మైదానాన్ని అభివృద్ధి చేసే దిశగా గతకొంత కాలంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఏయూ భూములు గతంలో అన్యాక్రాంతం అయ్యాయని, వీటిని పరిరక్షించుకుని, సంరక్షించే చర్యలు సైతం పూర్తిస్థాయిలో చేపడుతున్నామని వివరించారు.

ఐఐటి, నీట్‌పై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస శశి విద్యా సంస్థల ఆవరణలో 5, 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ఐఐటి, నీట్ విద్యపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ, తమ విద్యా సంస్థలో అంకిత భావం గల అధ్యాపకుల సమిష్టి కృషి ఫలితంగా ఏటా వివిధ పరీక్షల్లో అసాధారణ ఫలితాలు సాధిస్తున్నామని వివరించారు. వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ మాట్లాడుతూ, పిల్లల అభిరుచులకు అనుగుణంగా తల్లి దండ్రులు ఆలోచన చేయాలని సూచించారు. మార్కులు, ర్యాంకుల కంటే విద్యార్థుల్లో సృజనాత్మకత, మానసిక వికాసం పెంపుదల అవసరమని స్పష్టం చేశారు. పిల్లల భవిష్యత్తును నిర్దేశించేలా తల్లి దండ్రులు వ్యవహరించాలని సూచించారు. శశి విద్యా సంస్థల కార్యదర్శి, కరస్పాండెంట్ మేకా క్రాంతి సుధ, డైరెక్టర్ బూరుగుపల్లి రాధా రాణి, క్యాంపస్ ఇంఛార్జి వి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు.

10వ వార్డులో టిడిపి ప్రచారం



కరపత్రాలను పంచుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు పరిధి ఆదర్శనగర్‌లో టిడిపి, జనసేన, బిజెపి ఆధ్వర్యాన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, రాజశేఖర్ ఇంటింటికీ వెళ్లి ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వస్తే చేపట్టబోయే పథకాలను వివరించారు. కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో ఎమెల్యే, ఎంపీ అభ్యర్థులు వెలగపూడి రామకృష్ణబాబు, ఎం.శ్రీభరత్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, కేతా సత్యనారాయణ, మద్దిల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దాకమర్రి, అమనాంలో ముత్తంశెట్టి ప్రచారం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం దాకమర్రి, అమనాం గ్రామాల్లో భీమిలి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన పలు ప్రచార సభల్లో ఆయన మాట్లాడుతూ, అన్ని తరగతుల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సభల్లో ఎంపిపి దంతులూరి వాసు రాజు, వైస్ ఎంపిపి బోని బంగారునాయుడు, సర్పంచులు చెల్లూరి పైడప్పడు, దంతులూరి ఉమాదేవి, ఎంపిటిసి సభ్యులు నగేష్ బాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డి.పెదబాబు, ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షులు గాడు శ్రీను, నాయకులు పొట్నూరు చంద్ర శేఖర్, పల్లా సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు



గంటాతో జనసేన నాయకులు

గంటాను కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావును స్థానికంగా ఉన్న పలువురు జనసేన నాయకులు ఆదివారం అతని నివాసంలో కలిసి మద్దతు తెలిపారు. ఎన్నికల్లో విజయానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గంటాను కలిసిన వారిలో జనసేన నాయకులు నందిక రోహిత్ రెడ్డి, అశోక్, టి.శ్రీనివాసరావు, నాయుడు తదితరులు ఉన్నారు



సందీప్‌ను కలిసిన ఆనందపురం మండల జనసేన నాయకులు

భీమిలి టికెట్ జనసేనకు కేటాయించకపోవడంపై అసంతృప్తి

ప్రజాశక్తి -ఆనందపురం: భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ జనసేనకు కేటాయించకపోవడంపై ఆ పార్టీ నాయకులు అసంతృప్తి వ్యక్తంచేశారు. ఆనందపురం మండలం మెట్టమీదపాలెంలో ఆదివారం జనసేన మండల కమిటీ ఆధ్వర్యాన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా భీమిలి జనసేన ఇన్‌ఛార్జి సందీప్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల నాయకులు తమ తమ అభిప్రాయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇన్నాళ్లుగా జనసేన పార్టీలో బలంగా పని చేసామని, అయినా టికెట్‌ను టిడిపి కేటాయించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. భీమిలిలో 2019 సంవత్సరంలో జనసేనకు 25000 ఓట్లు వచ్చాయని, కూటమిలో భాగంగా ఈ సారి టికెట్ కేటాయిస్తే భారీ మెజార్టీతో గెలుస్తామని పేర్కొన్నారు. భీమిలిపై పునరాలోచించి జనసేన టికెట్‌ను సందీప్ కేటాయించాలని అధినేత పవన్ కల్యాణ్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రెసిడెంట్ తమ్మిన అప్పలరాజు, ఉపాధ్యక్షులు బాలు, శివకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ కోరుకొండ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



17వ వార్డులో పాదయాత్ర చేస్తున్న ఎంవివి సత్యనారాయణ

17వ వార్డులో ఎంవివి పాదయాత్ర

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ:వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగాలని విశాఖ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి, విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎంవివి సత్యనారాయణ కోరారు. ఆదివారం విశాఖ స్థానిక జీవీఎంసీ 17వ వార్డు ఎంపీపీ కాలనీ సెక్టార్-2, వెంకోజీపాలెంలో వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య నాగరాజు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంవివి మాట్లాడుతూ, వైసిపి పాలనలో అర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. విశాఖ - తూర్పు నియోజకవర్గంలో ప్రచారానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్పోరేషన్ డైరెక్టర్లు, చైర్మన్లు, పార్టీ శ్రేణులు, మహిళలు పాల్గొన్నారు..




ఇద్దరిని రక్షించిన జివిఎంసి లైఫ్ గార్డులు

యువకులను కాపాడిన లైఫ్ గార్డులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : రుషికొండ సముద్ర తీరంలో మునిగిపోతున్న హైదరాబాదుకు చెందిన ఇద్దరు యువకులను ఆదివారం లైఫ్ గార్డులు రక్షించారని జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ ఆదివారం తెలిపారు. రుషికొండ సముద్ర తీరంలో హైదరాబాదు ప్రాంతానికి చెందిన రాజు (26), సునీల్ కుమార్ (25) సముద్రంలో స్నానాలకు దిగారని, అలలకు చిక్కుకొని లోపలికి వెళ్లిపోతూ కేకలు పెడుతున్న వారిని జివిఎంసి లైఫ్ గార్డులు సతీష్, రాజు సకాలంలో స్పందించి వారి ప్రాణాలను కాపాడారని కమిషనర్ తెలిపారు. విశాఖ నగరానికి విచ్చేస్తున్న సందర్శకులు, పర్యాటకులు, నగర ప్రజలు సముద్ర తీర ప్రాంతాల్లో స్నానాలకు దిగి ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జివిఎంసి ఏర్పాటుచేసిన లైఫ్‌గార్డులు నిత్యం నిఘాతో పరిశీలిస్తూ వారి ప్రాణాలను కాపాడుతున్నారని తెలిపారు. బీచ్ అందాలను ఆహ్లాదకరంగా ఆస్వాదించాలని, సముద్ర లోతుల్లోకి వెళ్లి ప్రాణాలను పోగొట్టుకోరాదని సందర్శకులకు కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 77వ వార్డు పరిధి అప్పికొండ గ్రామానికి చెందిన సుమారు 50 మంది జనసేన యువకులు వైసిపిలో చేరారు. అప్పికొండలో జరిగిన అభివృద్ధి నచ్చి వైసిపిలో చేరినట్లు వారు తెలిపారు. మండలంలోని చీమలపల్లిలోని మీనాక్షి కన్వెన్షన్ సెంటర్‌లో జివిఎంసి 93, 94, 95, 96, 97, 98 వార్డుల వైసిపి నాయకులు, కార్యకర్తలతో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జనసేన యువకులకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ వైసిపి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకూ పార్టీలో మంచి గౌరవం దక్కుతుందన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలు చేరవేయటంలో కీలకపాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 77వ వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, గండి రవికుమార్, కోవిరి శివ కుమార్, ఎంపీ.రెడ్డి, వైసిపిలో చేరిన కమల్‌హాసన్, సోము నాయుడు, అర్జిలి కొండలరావు, మట్ట కొండయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



జనసేన నాయకులను వైసిపిలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజు

పలుచోట్ల ఈస్టర్ దినోత్సవం

ప్రజాశక్తి-యంత్రాంగం

ఈస్టర్ దినోత్సవాన్ని క్రైస్తవులు ఆదివారం ఘనంగా నిర్వహించారు.

సీతమ్మధార : ఈస్టర్ దినోత్సవం సందర్భంగా ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ఆదివారం 46వ వార్డు పరిధి శాంతినగర్, 48వ వార్డు పరిధి శ్రీనివాసనగర్‌లోని చర్చిలను సందర్శించారు. ఆయా చర్చిలలో నిర్వహించిన ప్రార్థనల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిష్టియన్ సోదరులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకలు బాణాల శ్రీనివాసరావు, వైసిపి నాయకులు ఆళ్ల శివ గణేష్, నీలి రవి, వసంతల అప్పారావు, బి.గోవింద్, కె.చిన్న, కర్రి రామారెడ్డి, చర్చి ఫాస్టర్లు పాల్గొన్నారు.

ఆరిలోవ : ఆరిలోవ హోలీ క్రైస్ట్ చర్చి ఆధ్వర్యాన క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆరిలోవ టిఐసి పాయింట్ నుంచి అంబేద్కర్‌నగర్, బాలజీనగర్, తోటగరువు మీదుగా డైరీఫారం వరకు ర్యాలీ నిర్వహించారు. బి.రవికుమార్, పాస్టర్ స్టీవెన్, ఇమ్మాన్యుయేల్, సేవకులు ప్రవచనాలు బోధిస్తూ, గీతాలాపన చేశారు.



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

మధురవాడ : బోయపాలెం చర్చిలో విశ్వాసులు భక్తి శ్రద్ధలతో ఆరాధించారు. పాస్టర్ బిషప్ డాక్టర్ కెఆర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



స్నాతకోత్సవ పట్టాలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి -గాజువాక : విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలని జాతీయ కస్టమ్స్, జిఎస్‌టి, నార్కోటిక్స్ శిక్షణా సంస్థ ఆంధ్రప్రదేశ్ జోనల్ అకాడమీ అడిషనల్ డైరెక్టర్ ఎదర రవికిరణ్ సూచించారు. డ్రైవర్స్ కాలనీలో గల శ్రీ సాయి విద్యానికేతన్ 25వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రవికిరణ్ హాజరై మాట్లాడుతూ, నేటి విద్యా విధానం చాలా కష్టంగా ఉందన్నారు. దాని తగ్గట్లుగానే ప్రిపేర్ కావాలని సూచించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి.రామ్‌నరేష్ స్కూల్ గొప్పతనాన్ని వివరిస్తూ విద్యార్థులు పెద్ద లక్ష్యాలు ఏర్పరచుకొని వాటి సాధన కోసం కృషిచేయాలని సూచించారు. గాజువాక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంటేనే మంచిదన్నారు. జిప్సా అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు, కార్యదర్శి బి.శ్రీనివాసరావు, కోశాధికారి ఎస్.శ్రీనివాసరావు, స్టేట్ సెక్రటరీ ఎం.సత్యనారాయణ, శ్రీ సాయి విద్యానికేతన్ డైరెక్టర్ ఎన్.రవికుమార్ ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమం అనంతరం స్నాతకోత్సవంలో భాగంగా యుకెజి చిన్నారులకు పట్టాలు అందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, వివిధ పాఠశాలల డైరెక్టర్లు పాల్గొన్నారు.

టిడిపిపై తప్పుడు ప్రచారం తగదు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:టిడిపి పై ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి విమర్శించారు. ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, డబ్బు ఉన్న వారికే టిడిపి సీట్లు ఇస్తుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఉత్తరాంధ్ర నుంచి నెల్లూరు వరకు బిసి లకు టిడిపి టికెట్లు ఇవ్వడం జరిగిందన్నారు. సిఎం కాక ముందు జగన్ ఆస్తి విలువ, ఇప్పుడు ఎంతో చెప్పాలని డిమాండ్ చేశారు. విశాఖలో టిడిపీ నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కేంద్ర నిఘా సంస్థలు నివేదిక ఇచ్చిన ప్రకారం జడ్ కేటగిరీ భద్రత కల్పిస్తారని, ఆ మాత్రం కూడా వైసిపి నేతలకు తెలియలేదని విమర్శించారు. వైసిపి నేతలు టిడిపిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.



దక్షిణ జనసేన అభ్యర్థిగా వంశీకృష్ణ శ్రీనివాస్ ఖరారు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం జనసేన ఎమ్మెల్యే అభ్యర్థిగా సిహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ పేరును పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అధికారికంగా ప్రకటించారు. దీంతో దక్షిణలో జనసేన అభ్యర్థి ఎవరు అనే సస్పెన్స్‌కు తెర పడింది. 34వ వార్డు పరిధి కొబ్బరితోట, అల్లిపురం ఏరియాలో టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జితో కలిసి వంశీకృష్ణ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రాంతాల్లో ప్రజల అవసరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వంశీకష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, స్వర్ణాంధ్రప్రదేశ్ రావాలంటే కూటమి ప్రభుత్వం రావాలన్నారు. గండి బాబ్జి మాట్లాడుతూ, వాసుపల్లి ఎమ్మెల్యేగా 10 ఏళ్లు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ఈ ప్రచారంలో 34వ వార్డు జనసేన అధ్యక్షులు నరేష్, మచ్చరాజు, పిల్లి రమణ, టిడిపి వార్డు అధ్యక్షులు రాంకుమార్, బిజెపి వార్డు అధ్యక్షులు చిన్నా, అత్తిలి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తరం'లో జోరుగా వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ పరిధిలో వైసిపి జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తోంది. అక్కయ్యపాలెం నరసింహనగర్ రైతు బజార్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ఆదివారం సందర్శించారు. పలువురు చిరు వ్యాపారులతో పాటు వినియోగదారులతో కొంతసేపు ముచ్చటించారు. చిరు వ్యాపారస్తులను ప్రోత్సహిస్తూ కొబ్బరికాయలు విక్రయించారు. ఈ సందర్భంగా కెకె రాజు మాట్లాడుతూ కులమతాలు, రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ ముఖ్యమంత్రి చేరవేశారని గుర్తు చేశారు.

53వ వార్డులో ఆత్మీయ సమావేశం

జవిఎంసి 53వ వార్డు పరిధి పంజాబ్ హోటల్ జంక్షన్‌లోని వైసిపి కార్యాలయంలో కార్పొరేటర్ బర్కత్ ఆలీ ఆధ్వర్యాన ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కెకె.రాజు హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు నిస్వార్థ సేవలు అందించారని తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి శ్రేణులు విస్తృతంగా శ్రమించాలని కోరారు.

42వ వార్డులో కార్యాలయం ప్రారంభం

జివిఎంసి 42వ వార్డు పరిధి రైల్వే న్యూకాలనీ బజార్‌లైన్ శివాలయం సమీపంలో వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, వైసిపి నాయకుడు శ్రీనివాస్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ఎన్నికల కార్యాలయాన్ని ఆదివారం కెకె.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేయాలని కోరారు. ప్రజల సంక్షేమానికి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను స్థానికులకు వివరించాలని కోరారు.



అక్కయ్యపాలెం రైతు బజార్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కెకె.రాజు

ఆయా కార్యక్రమాల్లో ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, 45వ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, బులుసు జగదీష్, నూకరాజు, హరిపట్నాయక్, అంబటి శైలేష్, ఎం.సునీల్, జ్ఞానేష్, బి.గోవింద్, బల్ల శ్రీను, టివిఆర్ మూర్తి, గుజ్జు వెంకటరెడ్డి, కృష్ణారావు మాస్టర్, అమర్‌రెడ్డి, ఆళ్ల శివగణేష్ తదితరులు పాల్గొన్నారు.

'కాఫీ విత్ క్యాడర్'తో కొణతాల



మాట్లాడుతున్న కొణతాల

ప్రజాశక్తి-అనకాపల్లి : జగన్మోహన్ రెడ్డి పాలనలో వ్యవసాయరంగం పూర్తిగా నిర్వీర్యమైందని టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి కొణతాల రామకృష్ణ ఆక్షేపించారు. కూటమి ప్రభుత్వంతోనే పోలవరం ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఆదివారం అనకాపల్లి పట్టణం 80వ వార్డు చిన రామస్వామి కోవెల వద్ద కూటమిలోని మూడు పార్టీల శ్రేణులతో కాఫీ విత్ క్యాడర్ కార్యక్రమం నిర్వహించారు. పాత 23,24,25 మున్సిపల్ వార్డులలోని మూడు పార్టీల శ్రేణులతో ఆత్మీయ సమావేశం జరిగింది. టీడీపీ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు బిఎస్ఎంకె జోగి నాయుడు అధ్యక్షతన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బిజెపి నేత సీఎం రిత్విక్, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, మారిశెట్టి భాస్కరరావు, మళ్ళ శ్రీను, బొడ్డేడ మురళీ, కర్రి మల్లేశ్వరరావు, కాండ్రేగులరాజు, విల్లూరి హరి, కర్రి మహాలక్ష్మినాయుడు, పీలా శివనాయుడు పాల్గొన్నారు.

గవిరెడ్డికి ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించాలి

నాలుగు మండలాల టిడిపి శ్రేణులు భారీ బైక్‌ర్యాలీ

ప్రజాశక్తి- దేవరాపల్లి : మాడుగుల నియోజకవర్గం తెలుగుదేశం టిక్కెట్‌పై అధినేత చంద్రబాబు పునరాలోచించి గెలిచే అభ్యర్థి గవిరెడ్డి రామానాయుడుకు టికెట్ ఇవ్వాలని మాడుగుల నియోజకవర్గంలోని నాలుగు మండలాల టిడిపి శ్రేణులు డిమాండ్ చేశారు ఆదివారం మాడుగుల నుంచి చీడికాడ, దేవరాపల్లి మండలాల మీదుగా కె.కోటపాడుకు వరకు 800 బైక్ లతో భారీ ర్యాలీ నిర్వహించారు. గెలిచే అభ్యర్థికి టికెట్ ఇవ్వాలని, మాడుగుల గడ్డ గవిరెడ్డి రామానాయుడు అడ్డా అని నినాదాలు చేశారు. ర్యాలీలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, మాజీ సర్పంచులు సోమిరెడ్డి గోవింద, గంధం జగన్, పెద్దాడ వెంకటరమణ, రాయవరపు సాంబమూర్తి, బొడ్డు వెంకటరావు, మలిరెడ్డి రాజనాయుడు, పెంటకోట అప్పలనాయుడు పాల్గొన్నారు

కె.కోటపాడు : గెలిచే గవిరెడ్డికి మాడుగుల టిడిపి టికెట్ ఇవ్వాలని నినాదాలు చేస్తూ టిడిపి శ్రేణులు భారీ ఎత్తున నిర్వహించిన బైక్‌ర్యాలీ మాడుగుల నుంచి చీడికాడ, దేవరాపల్లి మీదుగా కె.కోటపాడు వరకు సాగింది. లోకల్ ముద్దు.. నాన్ లోకల్ వద్దు. అంటూ గవిరెడ్డి రామానాయుడు మద్దతుదారులు నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు.



భారీ బైక్‌ర్యాలీలో పాల్గొన్న టిడిపి శ్రేణులు

మాడుగుల: మాడుగుల టిడిపి అసెంబ్లీ టికెట్‌పై పునరాలోచన చేయాలని ఆ పార్టీ నేతలు ర్యాలీ నిర్వహించారు. స్థానిక మోదకొండమ్మతల్లి గుడి నుంచి ర్యాలీ ప్రారంభించారు. నిత్యం ప్రజా సేవలో ఉంటున్న స్థానికులకు, బలమైన అభ్యర్థికి సీటును కేటాయించాలని నినాదాలు చేశారు. నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సతీమణితో ఎన్నికల ప్రచారంలో భరత్



80వ వార్డులో ఎన్నికల ప్రచారంలో వైసిపి అభ్యర్థి భరత్

ప్రజాశక్తి-అనకాపల్లి : గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు పరిచిన వైసిపికి మరో అవకాశం ఇచ్చి గెలిపించాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ ఓటర్లను అభ్యర్థించారు.ఆదివారం జివిఎంసి 80వ వార్డు అంబేద్కర్ నగర్‌లో కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారంలో తన సతీమణి నివేదితతో కలిసి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి, వచ్చేనెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు డివి నరసింహారావు, కంటపల్లె వెంకట్రావు, జి గణేష్, లోకేష్, కేయం నాయుడు, విల్లురి శివసూరి, వేగి త్రినాథ్, కర్రీ రుద్రీ నాయుడు, బుద్ధ శ్రీను, 81 వ వార్డు అంబేద్కర్ నగర్ నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

సాగర తీరంలో ఐపిఎల్ హోరు



సాగరతీరం విశాఖలోని డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ, విడిసిఎ స్టేడియంలో ఆదివారం సాయంత్రం జరిగిన మ్యాచ్‌లో పరుగుల వరద హోరెత్తింది. ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నయ్ సూపర్‌కింగ్స్ మధ్య జరిగిన ఈ మ్యాచ్ హోరాహోరీగా సాగి,చివరకు 20 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్ విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్‌జట్టుతో ఓపెనర్లు పృధ్వీషా, డేవిడ్‌వార్నర్‌తోపాటు వికెట్‌కీపర్ కెప్టెన్ రిషప్‌పంత్ అర్ధసెంచరీతో రాణించడంతో 191 పరుగుల భారీ స్కోర్ సాధించింది. తర్వాత లక్ష్యసాధనలో చెన్నయ్ సూపర్‌కింగ్స్ జట్టులో ఓపెనర్లు తడబడినా మిడిలార్డర్ రాణించడం, చివర్లో మహేంద్రసింగ్ ధోనీ, రవీంద్ర జడేజా మెరుపులతో విజయంపై ఆశలురేగిగా, ఢిల్లీ జట్టు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో చివరకు 20 వరుగుల తేడాతో మ్యాచ్ ఢిల్లీ క్యాపిటల్స్ సొంతమైంది.



















గోవిందరావుకు ఘననివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి : స్వాతంత్ర సమరయోధుడు సిపిఐ మాజీ ఎమ్మెల్యే కోడుగంటి గోవిందరావు 101వ జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని నాలుగురోడ్ల కూడలిలోని ఆయన విగ్రహానికి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దొరబాబు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ పాలనకు వ్యతిరేఖంగా జరిగిన పోరాటంలో కోడుగొంటి గోవిందరావు పాల్గొని జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు. సిపిఐ తరపున నాలుగుసార్లు అనకాపల్లి ఎమ్మెల్యేగా గెలిచి నీతివంతమైన సేవలు అందించారని, నేటితరం పాలకులకు గోవిందరావు ఆదర్శనీయు డన్నారు. విశాఖ హక్కు – ఆంధ్రుల హక్కు అనే నినాదం తో జరిగే పోరాటంలో పాల్గొని, విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన గొప్ప పోరాట యోధుడని కొనియాడారు. నాడు త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను నేడు బిజెపి పాలకులు ప్రైవేటీకరణ చేయడానికి కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు.కూటమి ఎంపి అభ్యర్థి సిఎం రమేష్ ఓట్లు కోసం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై మాయమాటలు, కట్టుకథలు చెప్పే పని ప్రారంభించాడన్ని, మోడీ ఆడుతున్న నాటకంలో పాత్రధారి బీజేపీ ఎంపి అభ్యర్థి సిఎం రమేష్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు మాజీ కౌన్సిలర్ తాకాసి వెంకటేశ్వరరావు, కోరిబిల్లి శంకరరావు, నారాలశెట్టి సత్యనారాయణ , విత్తనాల పోతురాజు,చిన్ని, వీరూ యదవ్, రమణ పాల్గొన్నారు.


గోవిందరావుకు నివాళులు అర్పిస్తున్న సిపిఐ నేతలు

జనసేనలో పలువురు చేరిక


జనసేనలోకి ఆహ్వానిస్తున్న పంచకర్ల

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అసకపల్లి పంచాయతీలో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన సర్పంచ్ కర్రి నరసింగరావుతోపాటు సుమారు వంద కుటుంబాలు ఆదివారం జనసేనలో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి జనసేనలోని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు ఆహ్వానించారు. కార్యక్రమంలో కూటమి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ పాల్గొన్నారు. సిఎం రమేష్ కు జనసేన జిల్లా నాయకులు బలిరెడ్డి అప్పారావు దుశ్శాలువ కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ. తనను స్థానికేతరుడని కొందరు కువిమర్శలు చేస్తున్నారని, వైసిపి నుంచి పోటీలో ఉన్న విశాఖ ఎంపి బొత్స ఝాన్సీ, భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి ఎక్కడి నుంచి వచ్చారని ప్రశ్నించారు. జనసేన నేతలు ఇందల వెంకటరమణ, బలిరెడ్డి అప్పారావు, కర్రి కనకరాజు, గండి దుర్గాప్రసాద్, పిల్లా జగన్మోహన్ పాత్రుడు, మామిడి రామారావు,బలిరెడ్డి రామకృష్ణ, బిజెపి నేతలు వనం సత్యనారాయణ, గొర్లి రామునాయుడు, గొంప నరసింగరావు పాల్గొన్నారు.

జనసేనలో 250మంది యువకుల చేరిక

అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలో వైసిపికి ఊహించని షాక్ తగిలింది. గవరపాలెం ప్రాంతానికి చెందిన 250 మంది యువకులు పట్టణ ప్రభాస్ ఫ్యాన్స్ అధ్యక్షులు కాంగ్రేగుల జోగేంద్ర ఆధ్వర్యంలో వైసిపికి గుడ్‌బై చెప్పి ఆదివారం జనసేన పార్టీలో చేరారు. మాజీమంత్రి జనసేన టిడిపి బిజెపి అనకాపల్లి నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ,అనకాపల్లి ఉమ్మడి పార్లమెంటు అభ్యర్థి సీఎం రమేష్ తనయుడు రిత్విక్ వీరికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ముందుగా అనకాపల్లి పురవీధుల్లో కాంగ్రేగుల జోగేంద్ర ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ జరిగింది. రామకృష్ణ స్వయంగా వాహనాన్ని నడిపి కార్యకర్తలను ఉత్తేజపరిచారు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షులు బీసెట్టి బాబ్జి మళ్ల తెలుగుదేశం నాయకులు సురేంద్ర బిజెపి నాయకులు కొణతాల అప్పలరాజు జనసేన నాయకులు దూలం గోపి మళ్ల శ్రీను, కాంగ్రేగుల సునీల్, దొడ్డి శ్రీను పాల్గొన్నారు.

గొండుపాలెంలో ప్రజాగళం ప్రచారం


ప్రచారంలో పాల్గొన్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు

ప్రజాశక్తి- కె. కోటపాడు : టిడిపి,జనసేన బిజెపి కూటమి మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు ఆధ్వర్యంలో ఆదివారం మండలం గొండుపాలెంలో ప్రజాగళం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టిడిపి శ్రేణులతో ఇంటింటికి వెళ్లిన పైలా ప్రసాదరావు, ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలు, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీపై వివరించారు. ఈ సందర్భంగా పైలా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీతో మాత్రమే మాడుగుల నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని, చంద్రబాబు సీఎం అయితే యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రొంగలి మహేష్, సర్పంచ్ బండారు లక్ష్మణరావు, బండారు ముత్యపాత్రుడు, పూడి నారాయణమూర్తి, క్లస్టర్ ఇంచార్జి కన్నూరు సూర్యనారాయణ, కె కోటపాడు మండల నాయకులు కోటన ఈశ్వరరావు, జనసేన నాయకులు బాలబోయిన సంతోష్, మాజీ ఎంపిపి సబ్బవరపు రామునాయుడు,ఎ కోడూరు సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, లెక్కల అవతారం, బండారు నరసింహనాయుడు పాల్గొన్నారు.

స్వయం ప్రతిపత్తి సంస్థల నిర్వీర్యం హానికరం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్వయం ప్రతిపత్తి సంస్థల నిర్వీర్యం వల్ల దేశానికి, ప్రజాస్వామ్యానికి హానికరమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి అవేదన వ్యక్తం చేశారు. కోడుగంటి గోవిందరావు జయంతి సందర్భంగా వై.విజయకుమార్ హాల్‌లో 'స్వయం ప్రతిపత్తి సంస్థల నిర్వీర్యం – పాలకుల పాత్ర – వాటి ప్రభావం' అంశంపై జరిగిన సదస్సులో సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం స్వయం ప్రతిపత్తి సంస్థలను నిర్వర్యం చేసిందన్నారు.

పదేళ్ల మోడీ పాలనలో ఒక్క అధికార పార్టీ నేతలపై కూడా ఇడి, సిబిఐ దాడులు జరగలేదని, కేవలం విపక్షాలను లక్ష్యంగా పెట్టుకుని, వారిని తమదారిలోకి తెచ్చుకునేందుకు బ్లాక్‌మెయిలింగ్, బెదిరింపు రాజకీయాలు, కుట్రలు జరుగుతున్నాయన్నారు. స్వయం ప్రతిపత్తి సంస్థలైన ఇడి, సిబిఐ, ఎన్నికల కమిషన్‌ను తమ స్వార్థ ప్రయోజనాల కోసం మోడీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందన్నారు. ప్రజా ఉద్యమాల ద్వారా మాత్రమే స్వయం ప్రతిపత్తి సంస్థలను పరిరక్షణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు రాజాన దొరబాబు, ఎం రాము నాయుడు, రెడ్డిపల్లి అప్పలరాజు, గురుబాబు, సుబ్బులక్ష్మి, నాగరాజు, తకాశి వెంకటేశ్వర్రావు, కన్నబాబు, దేముడుబబు, ఫణీంద్ర, బాబ్జీ, పోతురాజు, నారాలసెట్టి సత్యనారాయణ, సత్తిబాబు పాల్గొన్నారు.

చంద్రబాబును విమర్శించే నైతిక హక్కులేదు

వైవి.సుబ్బారెడ్డిపై టిడిపి జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగజగదీష్ ఫైర్

ప్రజాశక్తి- అనకాపల్లి : టిడిపి అధినేత చంద్రబాబు గురించి మాట్లాడే నైతిక హక్కు వైసిపి నేత వైవి సుబ్బారెడ్డికి లేదని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీష్ మండిపడ్డారు. ఆదివారం. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తాజాగా జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో రూ.20కోట్లు డిపాజిట్ చేస్తే ఎమ్మెల్యే, రూ.100 కోట్లు నుంచి రూ.140కోట్లు జమచేస్తే ఎంపి టిక్కెట్ కేటాయించిన వైసిపి, డబ్బున్నవారికే టిక్కెట్లు అమ్ముకుని బడుగులు, పేదలకు అన్యాయం చేసిందన్నారు. అతి పేదవారిని ఎమ్మెల్యేలుగా ఎంపీలుగా ఎమ్మెల్సీలుగా చేసిన ఘనత ఒక్క తెలుగుదేశం పార్టీకే దక్కుతుందన్నారు.

వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి రెడ్డి సామాజిక వర్గానికి పెద్దపేట వేసి ప్రభుత్వంలో ఉన్న నామినేటెడ్ పోస్టులు, ప్రాధాన్యత కలిగిన పోస్టులన్నీ కూడా జగన్ రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించుకున్నారని ధ్వజమెత్తారు. కులానికొకటి చొప్పున 56 కార్పొరేషన్లు పెట్టి, వారికి నిధులు విధులు లేకుండా బిసిలను వైసిపి నయవంచనకు గురిచేసిం దన్నారు. విశాఖ రాజధాని పేరుతో రూ.400 కోట్లు ఖర్చు చేసి రిషికొండను బోడిగుండు చేసి పర్యటకం పేరుతో ముఖ్యమంత్రి కార్యాలయం అనే ప్రచారం చేసుకుని ప్రజాధనం దుర్వినియోగం చేశారని విరుచుకుపడ్డారు. వైవి సుబ్బారెడ్డి హయాంలో విశాఖను డ్రగ్స్ రాజధానిగా మార్చేశారని, యువతకు ఉపాధి, ఉద్యోగాలు లేకుండా చేసి, గంజాయి, డ్రగ్స్ మత్తులో ముంచేశారని మండిపడ్డారు. ప్రజాకంటక పాలన సాగించిన వైసిపికి రానున్న ఎన్నికల్లో ఉత్తరాంధ్ర ప్రజలు గట్టి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. వైసిపికి ఇవే చివరి ఎన్నికలని నాగ జగదీశ్ ఎద్దేవా చేశారు.

పింఛన్ల పంపిణీకి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

ప్రజాశక్తి - యలమంచిలి : ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో వాలంటీర్ల జోక్యం ఉండకూడదన్న కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సోమవారం పంపిణీ చేయాల్సిన సామాజిక పింఛన్ల పంపిణీకి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు స్థానిక మున్సిపల్ అధికార్లు తెలిపారు. ప్రభుత్వం నుండి స్పష్టమైన ఆదేశాలేమీ రానప్పటికీ సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శి ద్వారా పెన్షన్ సొమ్ము పంపిణీకి రంగం సిద్ధం చేసినట్లు తెలిపారు. ఆదివారం నాటికీ పెన్షన్ సొమ్ము ఏ బ్యాంకులోనూ జమ కాలేదని, సోమ, మంగళవారాల్లో జమ అయితే బుధవారం నుంచి సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లను అందజేస్తామని మున్సిపల్ పెన్షన్ విభాగం అధికార్లు తెలిపారు.

పంచాయతీ వార్డు సభ్యురాలి హఠాన్మరణం

ప్రజాశక్తి- దేవరాపల్లి: మండలంలోని చింతలపూడి పంచాయతీ వార్డు సభ్యురాలు టోకూరు చినతల్లి ఆదివారం ఉదయం ఆకాల మరణం చెందారు. చినతల్లి హఠాన్మరణంపై గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు. చినతల్లి భర్త టోకూరు దేముడు చింతలపూడి సర్పంచ్‌గా సేవలందించాడు .చింతలపూడి పంచాయతీ సమ్మెద గ్రామానికి చెందిన చినతల్లి మృతికి ప్రస్తుత సర్పంచ్ దమ్ముంగి బోడమ్మతో పాటు పలువురు రాజకీయ నేతలు, గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

పోలీసుల ముమ్మర వాహన తనిఖీలు

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. ఆదివారం మండలంలోని రాజాం జంక్షన్‌లో స్థానిక ఎస్.ఐ. డి.ఈశ్వరరావు తన సిబ్బందితో వాహనాల తనిఖీలను చేపట్టారు. తెల్లవారు జామునుంచే సిబ్బందితో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితులు, సంఘవ్యతిరేక శక్తుల సమాచారమిచ్చి సహకరించాలని కోరారు.

నవోదయ, సైనిక్ స్కూల్‌కు సాయితేజ


సాయి తేజ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని పోలేపల్లి గ్రామానికి చెందిన గోల్కొండ సాయితేజ నవోదయ ప్రవేశ పరీక్షల్లో 100 కి 95 మార్కులు సాధించి ఆరో తరగతి ప్రవేశానికి అర్హత సాధించింది. అలాగే సైనిక స్కూల్ ప్రవేశ పరీక్షల్లో 300 మార్కులకు గాను 236 సాధించాడు. నవోదయ, సైనిక్‌స్కూల్‌లో మంచి ప్రతిభ కలిగిన విద్యార్థి సాయితేజను గ్రామస్తులు అభినందించారు.

నవోదయకు అయ్యన్న స్కూల్ విద్యార్థిని


సాయిశరణ్య

ప్రజాశక్తి- కె.కోటపాడు: స్థానిక అయ్యన్న ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఐదవ తరగతి విద్యార్థిని పూతిక సాయిశరణ్య విశాఖపట్నం కొమ్మాదిలోని జవహర్ నవోదయ స్కూల్‌లో ఆరవ తరగతిలో ప్రవేశానికి ఎంపికైందని అయ్యన్న విద్యాసంస్థల కరెస్పాండెంట్ డాక్టరు ఖాసిం తెలిపారు. ఈ ఏడాది జనవరిలో జరిగిన నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఆదివారం విడుదల చేసిన ఫలితాల్లో కె.కోటపాడు మండలంలో అయ్యన్న స్కూల్ నుండి సాయిశరణ్య ప్రవేశార్హత పొందిందన్నారు. సాయి శరణ్య నవోదయకు ఎంపిక కావడంపై స్కూల్ కరెస్పాండెంట్ డాక్టరు ఖాశీం, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం


సహచర మిత్రుడు, కేన్సర్ రోగికి ఆపన్న హస్తం

రూ.55 వేల ఆర్థిక సాయం అందజేత


సహచర మిత్రుడికి సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- అనకాపల్లి : కేన్సర్ వ్యాధికి గురైన స్థానిక మున్సిపల్ హైస్కూల్ 1975 బ్యాచ్ పూర్వ విద్యార్థి ఎన్‌వి రమణమూర్తికి అతని సహచర మిత్రులు, పూర్వవిద్యార్థులు వైద్యఖర్చుల నిమిత్తం రూ.55 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అతని ఆరోగ్యం కుదుట పడేవరకు అండదండలుగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రమణమూర్తి సహ విద్యార్థులు రాపేటి నారాయణరావు, మళ్ల లోకేష్, పొలిమేర పరదేశి నాయుడు, కాశీపతి శర్మ, కుర్మనాధ్ పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక


రాజు సమక్షంలో వైసిపి నుండి టిడిపిలో చేరుతున్న కార్యకర్తలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని మల్లం గ్రామంలో వైసిపి నుండి పలువురు కార్యకర్తలు టిడిపిలో చేరారు. ఆదివారం మాజీ సర్పంచ్ గొలగాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టిడిపికి చెందిన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కెఎస్ఎన్ఎస్ రాజు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబుల ఆధ్వర్యంలో బొట్ట పోతురాజు, కిల్లాడ నాగరాజు, బర్నికాన చిన్నోడు, అల్లు బోయిన కృష్ణ, ఓలిపోయిన అప్పలరాజు,చొప్పా బుజ్జి తదితరులు తమ కుటుంబాలతో టిడిపిలో చేరారు. వీరికి కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గోకవాడ కోటేశ్వరరావు గొలగన రాజారావు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉపమాకలో మసాలా ఘుమ ఘుమలు...

▶▶ ప్రతిఏటా వెంకన్న ఉత్సవాల్లో భారీగా విక్రయాలు ▶▶ మసాలా దినుసులకు బారులు

ప్రజాశక్తి-నక్కపల్లి: ఉపమాక తీర్ధంలో మసాలాలు ఘుమ ఘుమ లాడుతున్నాయి. ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన వెంకన్న వార్షిక తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా జరుగుతున్న తీర్ధంలో మసాలా దినుసులు వ్యాపారం ప్రత్యేకం. స్వామి వారి ఉత్సవాలు మార్చి 19వ తేదీన ప్రారంభమై 28వ తేదీ రాత్రితో ముగిసాయి. ప్రతీ ఏటా స్వామి ఉత్సవాలు సందర్భంగా కొత్త అమావాస్య ముందు రోజు వరకు (18 రోజుల పాటు) తీర్ధ జరుగుతుంది. తీర్ధంలో మసాలా దినుసులు, పిల్లల ఆట వస్తువులు, గృహోపకర సామగ్రి, గాజులు, ఫ్యాన్సీ వస్తువులతో పాటు తినుబండరాలకు సంబందించి తోపుడు బండ్లపై ఖర్జూరం, శెనగపప్పు, ద్రాక్ష వంటివి విక్రయిస్తారు.

తీర్ధంలో మసాలా దినుసులు వ్యాపారం అధికంగా సాగుతుంది. పసుపు, కుంకుం, జీలకర్ర, ధనియాలు, యాలికలు, దాల్చిన చెక్క, లవంగాలు, గసగసాలు, అవాలు, ఫలావు సామగ్రి, వెల్లుల్లి పాయలు, ఎండు మిర్చి తదితర సుగంధ ద్రవ్యాలను విక్రయిస్తుటారు.



విక్రయాలు చేపడుతున్న వ్యాపారులు



షాపుల వద్ద రద్దీగా ఉన్న జనం

విశాఖ ఏజెన్సీ ప్రాంతంతో పాటు, ఉత్తరాంధ్ర, తూర్పుగోదావరి జిల్లాల్లో పలు గ్రామాల నుంచి జనం తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకుని ఏడాది పొడువునా సరిపడే మసాల దినుసులు కొనుగోలు చేసుకుంటారు. నర్సీపట్నం, అనకాపల్లి, యలమంచిలి, తదితర మండలాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు వచ్చి మసాలా దినుసులు కొనుగోలు చేసుకుంటున్నారు. మసాలా దినుసులు కొనుగోలు చేసుకుని పెద్ద పెద్ద మూటలతో తీసుకువెళ్తున్నారు. చాలా మంది భక్తులు సెంట్ మెంట్‌గా భావించి ప్రతీ ఏటా ఉపమాక తీర్ధంలో మసాలా దినుసులు తప్పనిసరిగా కొనుక్కొని ఇళ్లకు తీసుకువెళ్ళడం అనవాయితీగా వస్తోంది. మసాలా దినుసులన్నీ ఒకే చోట లభించడంతో జనం దుకాణాల వద్ద ఎగబడుతున్నారు. దీంతో, మసాలా దినుసుల దుకాణాలు జనం రద్దీతో కిటకిలాడుతున్నాయి.



బస్తాలతో మోసుకెళుతున్న ప్రజలు

కోట్లాది రూపాయులతో వ్యాపారం

ఉపమాకలో జాతర సందర్భంగా కోట్లాది రూపాయుల మసాలా దినుసుల వ్యాపారం సాగుతుంది. సుమారుగా 15 షాపుల వరకు మసాలా దినుసులు షాపులు ఏర్పాటు చేశారు. తీర్ధంలో పలు ప్రాంతాల నుంచి వ్యాపారులు కమ్మలతో తాత్కాలిక షాపులు ఏర్పాటు చేసుకుని వ్యాపారం సాగిస్తున్నారు. ఈనెల 7వ తేదీ వరకు తీర్ధం కొనసాగుతుంది. శని, ఆదివారాలు పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వాలంటీర్లంటే ఎందుకింత భయం ?

-ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: టీడీపీ నాయకులకు వాలంటీర్లు అంటే ఎందుకింత భయమని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ప్రశ్నించారు. ఆదివారం ఆయన నాతవరంలో మాట్లాడారు. ప్రతీ నెలా 1వ తేదీనే వాలంటీర్ల ద్వారా పింఛన్ ఇచ్చే కార్యక్రమం జరుగుతుందని, ఏప్రిల్ 1న వాలంటీర్ల ద్వారా పింఛన్లు ఇవ్వకుండా చంద్రబాబు కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా ఒత్తిడి తీసుకు వచ్చారన్నారు. వాలంటీర్లను పక్కన పెట్టడం బాధాకరమన్నారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు కుటుంబం మరో రెండు నెలల్లో అల్లిపూడి వెళ్లిపోవడం ఖాయమన్నారు.

క్వారీ లారీల సామగ్రి అపహరణ

ప్రజాశక్తి -కొత్తకోట: సీజ్ చేసిన క్వారీ లారీల సామగ్రి దొంగల పాలైన సంఘటన రావికమతం మండలం దొండపూడి ఫారెస్ట్ ఠాణా వద్ద చోటు చేసుకుంది. అధికారులంతా ఎన్నికల నిర్వహణలో బిజీగా ఉండగా దొంగలు తమ చేతివాటం చూపించి సుమారు రూ.5 లక్షల విలువైన వాహనాలకు చెందిన టైర్లు, ఖరీదైన బ్యాటరీలు, ఇంజన్ సామాన్లు గత కొన్ని రోజులుగా తస్కరిస్తున్నారు.

రావికమతం మండలం చీమలపాడు శివారు అజయ్ పురం గ్రామ సమీపంలో ఒంగోలుకు చెందిన ఓ గ్రానైట్ కంపెనీ ఫారెస్ట్‌కు సంబంధించిన భూమిలో తప్పుడు అనుమతులతో గనులను తరలించక పోతున్నారంటూ పలువురు ప్రజాసంఘాల నాయకులు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాల మేరకు మూడేళ్ల కిందట సుమారు ఐదు భారీ వాహనాలను దొండపూడి ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద సీజ్ చేశారు. సీజ్ చేసిన వాహనాలను స్థానిక ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. ఆ వాహనాలకు సంబంధించిన స్పేర్ పార్టులను రాత్రి వేళల్లో దొండపూడికి చెందిన వ్యక్తితో పాటు చోడవరం, కే



టైర్లు అపహరణ గురైన వాహనం

కోటపాడు గ్రామాలకు చెందిన మరో ఇద్దరు వ్యక్తులు వాహనాలకు సంబంధించిన సామగ్రిని అపహరించినట్లు సమాచారం అందడంతో కొత్తకోట పోలీసులు విచారణ చేపట్టారు. కె.కోటపాడుకు చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచా రం.

త్వరలో పూర్తి వివరాలు: ఎస్ఐ

ఈ విషయమై కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావును వివరణ కోరగా.. ఈ ఘటన పై కోటపాడుకు చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు చెప్పారు. దొండపూడికి చెందిన మరో వ్యక్తి ప్రమేయం ఉన్నట్టు సమాచారం ఉందన్నారు. త్వరలో పూర్తి వివరాలు వెల్లడి చేస్తామని ఎస్ఐ పేర్కొన్నారు.

వైసిపి పాలనలో దోపిడీ : అయ్యన్న

ప్రజాశక్తి-గొలుగొండ: దోపిడి లక్ష్యంగా వైసీపీ పాలన కొనసాగిందని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. గొలుగొండ మండలం పప్పుశెట్టిపాలెం గ్రామంలో ఆదివారం ఎన్నికల శంఖారావం నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు టీడీపీలో చేరారు. పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ,ఎన్నికల ముందు మద్య నిషేదం అని చెప్పి తీరా అధికారంలోకి వచ్చి మద్యంపై వ్యాపారం చేశారన్నారు. మద్యం దుకాణాలను తాకట్టు పెట్టారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సీపీఎస్ రద్దు చేస్తామని ఉద్యోగులను మోసం చేశారన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మిగిలిపోవడం సిగ్గు చేటన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 18 సంవత్సరాల నిండిన ప్రతి మహిళకు నెలకు 1500 రూపాయలు ఇస్తామన్నారు. ఇంటిలో చదువుకున్న పిల్లలు ఎంతమంది ఉన్నా అందరికీ సంవత్సరానికి 15 వేలు, ప్రతి ఇంటికి సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు, మూడు వేల నిరుద్యోగ భృతి ఇస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అప్పలనాయుడు, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ సూర్యచంద్ర, సీనియర్ నాయకులు సాంబమూర్తి, అదపురెడ్డి గోపాలకృష్ణ, బెల్లపు కొండలరావు, గెడ్డం ఆనంద్, నర్సింపల్లి మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

ఓటు హక్కుపై ర్యాలీ

ప్రజాశక్తి-గొలుగొండ: ఎన్నికల్లో ప్రజలంతా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని నర్సీపట్నం రూరల్ సీఐ బి.హరి సూచించారు. ఆదివారం కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏఎల్‌పురం, కొంకసింగి, నాగాపురం, పాతకృష్ణదేవిపేట, చోద్యం తదితర గ్రామాల్లో ఆర్పీఎఫ్ కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రశాంత ఎన్నికలకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణదేవిపేట ఎస్సై ఎం.ఉపేంద్ర ఉన్నారు.

తాగునీటిని జాగ్రత్తగా వాడుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: వేసవి కాలం దృష్ట్యా రక్షిత మంచినీటిని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని రావికమతం మండలం కవగుంట సర్పంచ్ దాసరి సూర్య కుమారి కోరారు. కవగుంట పంచాయతీ శివారు బుద్ధిబంద గ్రామంలో రక్షిత మంచినీటి పథకాన్ని అధికారుల సహకారంతో మరమ్మతులు చేపట్టామన్నారు. తరచూ మరమ్మత్తుకు గురవడంతో ప్రతి ఒక్కరు జాగ్రత్తగా వాడుకోవాలని సూచించారు. పంచాయితీలో నిధులు లేని కారణంగా ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు గాను సొంత డబ్బులతో మరమ్మతులు చేపట్ట వలసిన వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గంగరాజు, రవి, శంకర్రావు, వీరభద్ర రాజు, శ్రీను పాల్గొన్నారు.

'నర్సీపట్నంలో అభివృద్ధి పనులు ఏవీ'

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: నర్సీపట్నంలో ఎమ్మెల్యే గణేష్ ఎటువంటి అభివృద్ధి పనులు చేయకపోగా ప్రతిపక్ష నాయకులను విమర్శిస్తూ ఐదేళ్లు కాలయాపన చేశారని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర అన్నారు. ఆదివారం నర్సీపట్నంలో కృష్ణాపేలస్‌లో జనసేన పార్టీ బూత్ కమిటీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, ఏరియా ఆసుపత్రిలో కనీసం లిఫ్ట్ బాగు చేయలేకపోయారన్నారు. సెల్ ఫోన్ల వెలుగులో ఆపరేషన్లు చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మ్యాట్స్ ఇస్తున్న నిర్వాహకులు

క్రీడాకారులకు రబ్బర్ మ్యాట్స్ అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: నర్సీపట్నంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నింజాస్ అకాడమీ సుమారు 50వేల విలువ 45 స్పోర్ట్స్ మ్యాట్స్ చైర్మన్ వెలగా నారాయణరావు, డైరెక్టర్స్ సుతాపల్లి బ్రదర్స్ శ్రావణ్, శ్రీకాంత్ క్రీడాకారులకు అందజేసినట్లు డైరెక్టర్స్ పారుపల్లి శ్రీనివాస్, రుత్తల రమా తెలిపారు. వీటిని వూషు సీనియర్ కోచ్ శేఖర్, వేపాడ ప్రియాంక క్రీడాకారులకు అందజేశారు. అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు మాట్లాడుతూ, నర్సీపట్నం నుండి ఉషు కుస్తీ పోటీలకు ఎంతో మంది నేషనల్‌కు వెళుతున్నారని తెలిపారు. 6 నెలల నుండి మ్యాట్స్‌పై స్పాన్సర్ కోసం వెళ్లామని, చివరకు తామే ఇవ్వడం జరిగిందని తెలిపారు. మ్యాట్స్‌ను అందజేయడంపై క్రీడాకారులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు, పలువురు కోచ్‌లు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు జి.సుబ్బారావు



కార్మిక, ప్రజా నాయకునిగా గుర్తింపు
పలు కాలనీల నిర్మాణంలో కీలకపాత్ర
కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం
నేడు గాజువాకలో ఆయన ప్రథమ వర్ధంతి సభ

ప్రజాశక్తి - గాజువాక

జి.సుబ్బారావు.. ఈ పేరు తెలియనివారు గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో ఉండరంటే అతిశయోక్తి కాదు. గాజువాక ప్రాంతంలో సిపిఎం సుబ్బారావుగా ఆయన అందరికీ సుపరిచితులు. సిపిఎంనే తన ఇంటి పేరుగా సుస్థిరం చేసుకున్న నేత ఆయన. సుబ్బారావు వస్తే సమస్య పరిష్కారమైపోతుందన్నది ఇక్కడి ప్రజల నమ్మకం. అటువంటి పోరాటాలు ఆయన సలిపారు. గాజువాక పారిశ్రామిక ప్రాంత కార్మికుల సమస్యలపైనా, ఇక్కడి నివాస ప్రాంతాల్లోని ప్రజల సమస్యలపైనా ఆయన చేసిన కృషి మరువలేనిది. అందుకే ఆయన కార్మిక, ప్రజా నాయకునిగా గుర్తింపు పొందారు. ఆ మహనీయుడు కన్నుమూసి ఏడాది కావొస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన ప్రథమ వర్ధంతి సభ సోమవారం సాయంత్రం 4 గంటలకు గాజువాకలోని సిఐటియు కార్యాలయంలో జరగనుంది. సిపిఎం, సిఐటియు ముఖ్య నేతలు, కార్మికులు, నివాస ప్రాంతాల ప్రజలు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఆయన పోరాట ప్రస్థానాన్ని గుర్తుచేస్తూ సాగేదే ఈ కథనం.

జి.సుబ్బారావు 1947 జనవరిలో తూర్పుగోదావరి జిల్లాలో తిరుపతయ్య, సత్యవతి దంపతులకు జన్మించారు. అక్కడే ప్రాథమిక, హైస్కూల్ విద్యతో పాటు ఐటిఐ పూర్తి చేశారు. 1973లో బిహెచ్‌పివిలో ఉద్యోగంలో చేరారు. ఆ సమయంలో సిఐటియు విధానాలకు ఆకర్షితులై ఆ యూనియన్‌లో చేరారు. క్రమంగా కమ్యూనిస్టు సిద్ధాంతాలను వంటబట్టించుకొని సిపిఎం సభ్యత్వం తీసుకున్నారు. సిఐటియు, సిపిఎంలో వివిధ హోదాల్లో పని చేశారు. బిహెచ్‌పివిలో ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి సిఐటియులో చేరినప్పటి నుంచి ఆ పరిశ్రమల్లో జరిగిన ప్రతి ఉద్యమంలోనూ కీలకపాత్ర వహించారు. బిహెచ్‌పివిలో సిఐటియు గుర్తింపు యూనియన్‌గా ఉన్నప్పుడు యాజమాన్యం విధించిన అక్రమ లాకౌట్‌కు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో సుబ్బారావు సస్పెండ్ అయ్యారు. తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు. అయినా ఆయన వెరవలేదు. బిహెచ్‌పివిలో ఉద్యోగం చేస్తూనే గాజువాక పరిసర ప్రాంతాల్లో ప్రజలు, కార్మికుల సమస్యలపై అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించారు. గాజువాక ఆటోనగర్‌లో 1976 సంవత్సరంలో కార్మికుల జీతాలు, ఇతర సౌకర్యాలపై సుబ్బారావు నాయకత్వంలో నిర్వహించిన పోరాటాలు సిఐటియుకు బలం చేకూర్చాయి. 1980-82 స్టీల్‌ప్లాంట్ క్రాంటాక్టు లేబర్ సమస్యలపై సుదీర్ఘ పోరాటం నడిపి, వారికి కనీస వేతనాలు సాధించడంలో ముఖ్య భూమిక వహించారు. స్టీల్‌ప్లాంట్ నిర్మాణ సమయంలో షీలానగర్ నుండి స్టీల్‌ప్లాంట్‌కు రైల్వే ట్రాక్ ఏర్పాటు చేయగా, షీలానగర్‌లో భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం విషయంలో రాజీలేని పోరాటం నడిపి విజయం సాధించారు.

కణితి, పెదగంట్యాడ యార్డుల్లో కార్మికులకు జీతాలు చెల్లించడంలో తీవ్ర జాప్యం జరుగుతున్న సమయంలో సుబ్బారావు జోక్యం చేసుకోవడంతో సకాలంలో జీతాలు చెల్లించడంతోపాటు, జీతాలు కూడా పెరిగాయి. గాజువాక ఆటోనగర్‌లో సాహువాలా సిలిండర్ కంపెనీ కార్మికులకు జీతాలు చెల్లించకుండా యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తే పది రోజులపాటు సమ్మె చేసి కార్మికులకు జీతాలతో పాటు కనీస సౌకర్యాలు సాధించారు. గంగవరం పోర్టు నిర్వాసిత మత్స్యకారులకు అండగా పెద్ద ఎత్తున జరిగిన పోరాటంలో సుబ్బారావు కీలకంగా వ్యవహరించారు. ఈ సమయంలో 145 రోజులపాటు జైలు జీవితాన్ని గడిపారు. సర్వే నెంబరు 274లోని వెంకన్నపాలెం, భానోజీ కొండపై పేదలకు ఇళ్ల స్థలాల కోసం చేసిన పోరాటంలో ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడంతో పది రోజులపాటు జైలుకు వెళ్లారు. తిరిగి వచ్చిన తరువాత పోరాటాన్ని కొనసాగించారు. ఫలితంగానే చాలామందికి వాంబే గృహాలు మంజూరయ్యాయి. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పెంచిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా సుబ్బారావు నాయకత్వంలో పెద్ద ఎత్తున పోరాటం సాగింది.

గాజువాక ఇనాం భూ సమస్య టిడిపి హయాంలో వెలుగులోకి వచ్చింది. ఫలితంగా నాడు గాజువాకలోని భూముల్లో నిర్మాణాలు జరగకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో సుబ్బారావు నేతృత్వంలో సుదీర్ఘమైన పాదయాత్రలు చేపట్టారు. ప్రతి వీధిలోనూ, ప్రతి కాలనీలోనూ హౌస్ కమిటీ పేరుతో సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యపరిచారు. చంద్రబాబు ప్రభుత్వం గాజువాక హౌస్ కమిటీ సమస్యపై జీవో నెంబర్ 7 జారీ చేయగా, ఆ జీవోకు వ్యతిరేకంగా పోరాటం నడిపి ఆ జీవో రద్దు చేసే విధంగా చేయగలిగారు. ఆ తరువాత రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన పిదప జీవో నెంబర్ 44ను జారీ చేశారు. దీంతో 2000 మందికి పట్టాలొచ్చాయి.

విశాఖ డెయిరీ నిబంధనలకు విరుద్ధంగా విడుదల చేసిన కాలుష్యం వల్ల అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, మింది గ్రామాల ప్రజలు కాలుష్య బారిపడి తీవ్ర ఇబ్బందులు పడేవారు. నాడు ఈ కాలుష్యానికి వ్యతిరేకంగా సుబ్బారావు ఆధ్వర్యాన అనేక పోరాటాలు నడిచాయి. ఈ సమయంలో నాడు విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు పోలీసుల చేత సుబ్బారావుపై నిర్బంధం ప్రయోగించినా ఆయన ఎక్కడా భయపడకుండా పోరాటాన్ని నడిపారు. డెయిరీ చైర్మన్ తులసీరావు షీలా నగర్ దగ్గర విలువైన ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తే దానిని నిలువరించడంలో సుబ్బారావు కీలకపాత్ర వహించారు. వర్షం పడితే షీలానగర్ వెంకటేశ్వర కాలనీ ముంపునకు గురయ్యేది. ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చేయాలని సుబ్బారావు నాయకత్వంలో చేసిన పోరాట ఫలితంగానే శాశ్వత అవుట్ లెట్ ఏర్పాటు చేశారు. దీంతో ఆ సమస్య పరిష్కారమైంది. పివి.నరసింహారావు ప్రధానమంత్రిగా ఉండగా కొండలపై నివాసాలను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో అప్పటి గాజువాక ఎమ్మార్వో బొజ్జన్నకొండ, అప్పన్నకొండ, కాళికానగర్, శ్రీనగర్ కొండలపై నివాసముంటున్న పేదల గుడిసెలు తొలగిస్తుంటే సుబ్బారావు ఆధ్వర్యాన అడ్డుకోవడం జరిగింది. దీంతో ఇక్కడి పేదలకు ఇళ్ల స్థలాలు వచ్చి శాశ్వత నిర్మాణాలు చేపట్టారు.

కరోనా సమయంలోనూ సేవలు

కరోనా కాలంలో ప్రజలంతా ఇంటి నుంచి బయటకు రావడానికే భయబడిన సమయంలోనూ సుబ్బారావు కార్మికులు, పేదలకు సేవలు అందించారు. ఆయన ఆధ్వర్యాన ప్రతిరోజూ భోజనాలు వండించి, ప్యాకింగ్ చేసి రోడ్డు మీద ఉన్న బిచ్చగాళ్లు, వలస కార్మికులకు అందించేవారు.

కాలనీల ఏర్పాటులో కీలక పాత్ర

గాజువాక పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో రాష్ట్రంలోనూ, దేశంలోనూ వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు గాజువాక ప్రాంతానికి పనుల కోసం రావడంతో ఇక్కడ నివాస సమస్య తీవ్రతరమైంది. ప్రధానంగా అసంఘటిత కార్మికులు ఇంటి అద్దెలు చెల్లించలేక తీవ్ర ఇబ్బంది పడేవారు. వీరందరికీ శాశ్వత నివాసాల కోసం రాసాలమ్మ కాలనీ, సుందరయ్య కాలనీ, స్వతంత్ర నగర్, దశమకొండ, ఎర్రగడ్డ కాలనీ, ఉప్పర కాలనీ తదితర కాలనీలను ఏర్పాటు చేయడంలో సుబ్బారావు ముఖ్య భూమిక వహించారు. ఈ ప్రాంతాల్లో సుబ్బారావు పేదల చేత పాకలు వేయిస్తే ఎమ్మార్వో ఆఫీస్ సిబ్బంది వచ్చి తొలగించే వారు. మళ్లీ అదే రోజు రాత్రికి మళ్లీ పాకలు నిర్మింపజేసేవారు. ఇలా రోజూ ఉదయం ఎమ్మార్వో ఆఫీస్ సిబ్బంది పాకలను తొలగించడం, సుబ్బారావు ఆధ్వర్యాన రాత్రి సమయంలో పాకలను నిర్మించడం చేసేవారు. దీంతో రోజూ ఘర్షణ వాతావరణం నెలకొనేది. ఈ సమయంలో పోలీసు కేసులను ఎదుర్కొన్నారు. పోలీసులు, అధికారులు ఎన్ని ఇబ్బందులు పెట్టినా సుబ్బారావు పేదలను విడిచిపెట్టకుండా వారందరికీ పట్టాలు ఇచ్చేవరకు పోరాటాన్ని కొనసాగించారు. ఆ పోరాటాల ఫలితంగానే శాశ్వత కాలనీలు ఏర్పాటయ్యాయి. జివిఎంసి పరిధిలో పారిశుధ్య కార్మికుల సమస్యలపై సుబ్బారావు నేతృత్వంలో చేసిన పోరాటం స్థిరస్థాయిగా నిలిచిపోతుంది. పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు, ఇతర సౌకర్యాలు సాధించడానికి చేసిన పోరాటాలు అనేక విజయాలు సాధించాయి. అంతలా ఉద్యమాలు నడిపారు కాబట్టే సుబ్బారావు కన్నుమూసిన తరువాత కార్మిక, కర్షక లోకం కన్నీరుమున్నీరైంది. సుబ్బారావుకు భార్య మణి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇద్దరు కుమారులు ఇంజినీరింగ్ పూర్తి చేసి ఉద్యోగంలో స్థిరపడ్డారు.